# గుండె గొంతుక లోన

"ఆడవాళ్ళను నమ్మకూడదు" ఇది మురారి ఆఖరుగా అన్న మాటలు.

అవును నమ్మకూడదు. వాళ్ళకి నమ్మించటం చేతకాదు. తాను మనసా నమ్మినట్లు ప్రవర్తించటం తన హృదిలో నిక్షేపించుకున్న వాస్తవాన్ని బయటపెట్టి తాను విశ్వసించిందాన్ని, నిర్భయంగా విప్పి చెప్పటం అందరి మానవులపట్ల సహజమైనా అబలకు — ముఖ్యంగా తనకు సాహసం. 'నా మనసులోని మాట ఇది' అని చెప్పటానికి ఏదో సిగ్గు, భయం. సిగ్గు భయంకంటె బలవత్తరమైనది. సున్నితమైన దైన ఏదో అంతర్భూతమైన శక్తి అడ్డు తగులుతుంది. తాను నమ్మిన దాన్ని అక్షర రూపంలో పొడిపొడిగా చెప్పలేని కారణాన తాను చీకటి ముసుగులో తన్నుకో బోతున్నానని తెలిసినా సరే, తన జీవనతారక అస్తమించబోతున్న విషయం స్పష్టమైనా సరే, తన వివేకం 'నీ గొయ్యి నువ్వే తీసికొంటున్నావ్' అని నచ్చచెప్పినా సరే — తను మాట్లాడదు. తను హృదయపూర్వకంగా విశ్వసించిన భావానికి అక్షర రూపం ఇవ్వలేదు. తన నోటితో బయట పెట్టలేదు. దానిక్కారణం స్త్రీత్వానికి అంటిపెట్టుకుని ఉన్న అశక్తతే అయితే మురారి మాటలు అక్షరాలా నిజం.

తన హృదయ కవాటం మురారికి, శ్రీపతికీ సర్వకాలాల్లోనూ స్వాగతం పల్కింది. ఇద్దరూ తన గుండెలో అడుగులు పెట్టారు. అవి చెరగని ముద్రలు.

మురారి తన హృదయద్వారానికి మామిడాకుల తోరణంకట్టి మురిసిపోతే, శ్రీపతి తన గుండెలో మల్లెలు పూయించాడు.

మురారి సామాన్యమానవుడు—మానవుడికుండే కష్టమూ సుఖమూ, అందులోని ఆనందం, విచారం సమ్మిశ్రితం చేసిన జీవితానికి ప్రతిమూర్తి.

శ్రీపతి కవి, భావుకుడు. ఊహతో మనిషిగా తన బ్రతుకునే అధిగమించి, ఆకాశాలు దాటిపోయి లోకాన్ని విస్మరించి భావనాతీతమైనదానికి ప్రాణంపోసే మధురస్వప్నం. అతని భావనతో జోడుకలిపి గుండె శ్రుతిచేసికొంటే 'విమల గాంధర్వం' విన్పిస్తుంది.

లోకాల కావల, అనంతమై సంధ్యాల అవతలి ఒడ్డున చిన్నగుడిసె కట్టుకుని అందులో నేనూ శ్రీపతీ—

జనసంచారంలేని ఆ ప్రదేశంలో, ఎటుచూసినా జలమయమై సాగరుడు పొంగులెత్తుతుంటే, గుర్రాల్లాటి అలలు తరుముకొస్తుంటే నేనూ శ్రీపతీ ఆ నల్లటి నీళ్ళలో శిరమెత్తి తలమునకలుగా ఈదులాడి స్నానాలు చేస్తూ — పచ్చటి ఇసుకలో కాళ్ళుదూర్చి, ఆలిచిప్పల్తో నే నాడుకుంటుంటే, ఇసుకపొరలోంచి ఎండ్రకాయ బుసబుస తోసుకొచ్చి, నన్ను చూసి ఒక్కసారి కొండేలతో మూతివిరిచి, బిల బిల సాగిపోతుంటే తదేకంగా చూస్తున్న నేను, నాకు తెలియకుండా వెనకగా వచ్చి ఆ రోజు సముద్రములో దొరికిన ముత్యాలు హారంగా కూర్చి శ్రీపతి తనమెళ్ళో అలంకరించితే అతనిచేతి వేళ్ళు గిలిగింతలు పెట్టగా, మనసు మురిసిపోయి,

తనువు సిగ్గయిపోయి, శ్రీపతి కళ్ళల్లోకిచూస్తూ సాయంసంధ్యని చూట్టంకూడా మర్చిపోతే_

ఇది వట్టి భావన. అసాధ్యమైన దాన్ని సాధ్యమైనట్టు భావించటం వెర్రి అని తెలిసినా తను ఊహ చేయకుండా ఉండలేదు. ఎంతటి ఊహ చేసినా, ఎన్నో ఆనందలోకాల్లో విహరించి వచ్చినా, ఎంతటి మహదానందాన్ని పొందినా, ఆ అనుభూతి క్షణికం. అది తాత్కాలికమని తెలిసినా దాని మీదనే మనసు పీకుతోంది. ఊహతో ఎంతెంత ఎత్తులకు పోగల్గినా తన కాళ్ళు నేలమీద ఉన్నాయని మర్చిపోలేక పోవటం చిత్రం. శ్రీపతి తనని సముద్రాల కవతలకి తీసుకు పోయినా తన మనసు ఆలిచిప్పలు, సాయంసంధ్యని దాటి పోలేక పోయింది. అంతటి ఊహ చివర కడుపులో ఆకలి భగ్నమంది. ఏమయినా ఆ భావనానందంలో మనసు ఉల్లాసంతో కుప్పి గంతులు వేస్తుంది. అశాశ్వతమైతేనేం అర నిముస మైతేనేం _ అది కావాలి. మురారిని గూర్చిన ఆలోచనలు వేరు. శ్రీపతితో సాన్నిహిత్యాన్ని పోలిస్తే ఇది శాశ్వత మనిపిస్తుంది - మానవులుగా బతుకుతూ అందులో ఉండే ఆనందం పంచుకోవటం. కష్టమొచ్చినప్పుడు బాధ పడుతూ, సుఖం వచ్చినప్పుడు ఖులాసాగా ఉంటూ, చెయ్యీ, చెయ్యీ కలుపుకు జీవించటం.

మురారితో సంసారం ముచ్చటగా ఉంటుంది. అద్దె ఇంట్లో చాలీ చాలని జీతంతో గడుపుతూ _ వాటికి తోడుగా ఓ పాపాయి. పేరుకోసం ఇద్దరం పోట్లాడుకుంటాం. తనమాట నెగ్గలేదని మురారి చిన్నబుచ్చుకుంటే నేను లాలించి బుజ్జ

గి స్తే, చిన్నపిల్లాడిలా అయిపోయి మారాము చేస్తే—పాపతనను వచ్చీరాని మాటల్తో 'అమ్మా' అని పిలిస్తే — ఒక్కోసారి పాప తనని ముద్దు పెట్టుకున్నందుకు కోపమొచ్చి చిరుగోళ్ళతో నా మొహమంతా రక్కి— బుగ్గలన్నీ పీకి, జుట్టు రేపేస్తుంటే నేను మళ్ళీ మళ్ళీ ముద్దాడితే, కోపం పెరిగిపోయి ఏం చేయ లేక, అసహాయంగా బావురుమంటే తన గుండె తరుక్కు-పోయి 'నాయన్ని' హృదికి హత్తుకొని పాలిస్తే—

చాలీచాలని జీతంతో, లేనిరోజు విచారిస్తూ ఆ విచారంలో ఒకళ్ళ కొకళ్ళం ధైర్యం చెప్పుకుంటూ, లేనిరోజు దాటి అనుభవం ధర్మాన ఉన్ననాటి సుఖాన్ని పూర్తిగా అనుభవిస్తూ, కోపం చిరాకూ, శాంతం సహనం, నిరాశ నిస్పృహ, ఆశ ధైర్యం, కష్టం సుఖం, దుఃఖం సంతోషం, ఆనందం విచారాలమధ్య నలుగుతూ మెలుగుతూ, మెలితిరిగి పోతూ తేరుకుంటూ, తియ్యగా, బాధగా, మనిషిగా ఈ గడ్డ మీద జీవిగా బతికితే—

శ్రీపతి కవిత్వం వింటే తను కరిగిపోతుంది. మురారిని చూస్తే తనలో తియ్యని బాధ మూల్గుతుంది. బాధలోని మాధుర్యం చూపిస్తాడు మురారి. భావనలోని ఆనందం అందిస్తాడు శ్రీపతి. శ్రీపతి ఆనందలోకాల కేక. మురారి ఈ లోకపు తియ్యటి మూలుగు.

తనకు రెండూ కావాలి. రెంటికీ తను కావాలి. ఆ లోకాల కేక నందుకుంటూ ఈ లోకంలో తియ్యగా మూల్గాలి. ఆ లోకాల భావనలో పరవశం పొందినా ఈ లోకం సుఖదుఃఖాలమధ్య నలిగి, అలసిపోయి, బాధగా, హాయిగా కంటనీరెట్టుకోవాలి.

కాని రెంటిలో ఒకదాన్నే ఎంచుకోవాలి — తప్పదు. తను ఊహచేయలేని ముద్దుగా పుత్తే బావుండేది. కాకపోతే భావనానంద మధురిమలో నిశ్వాసరూపంగా అసువులు విడిచి పెట్టగల విలక్షణమైన జీవిగా పుట్టినా హాయిగాఉండేది. తను ఏదీ కాదు. రెండూ కాకపోలేదు.

ఆ రోజు లక్ష్మి పుట్టినరోజు. శ్రీపతీ, మురారీ ఇద్దరూ విందు కొచ్చారు. ఇద్దరిలోని వైవిధ్యం స్పష్టంగా కన్పించింది. ఇద్దరూ కానుకలు తెచ్చారు. శ్రీపతి అందంగా గీతం రాసు కొచ్చాడు. ఈపద్యం నైవేద్యంగాఅర్పిస్తున్నా నన్నాడు.మురారి టాయిలెట్ సెట్‌తో కలిసిఉన్న పెద్ద బెల్జియం అద్దం కొని చ్చాడు. అది ముచ్చటగా ఉందని తను మురిసి పోయింది.

శ్రీపతి తన భావనకు చిహ్నంగా గీతంవ్రాస్తే, మురారి లౌకికము, శారీరకమైన విషయాల్ని ప్రతిబింబింపచేసే అద్దాని బహూకరించాడు. ఇంతటి భిన్నత్వంలోనూ తన్ను గురించిన ఏకత్వం కన్పిస్తోంది.

ఆ రోజు ఉదయం అలంకరించుకుంటూ శ్రీపతి గీతం తలుచుకు మైమరిచి పోయింది. మనసు పరవశమైపోయి ఆనందమయ మయింది. మత్తుగా కళ్ళు విప్పిచూస్తే ఎదురుగా తన ప్రతిబింబం. మురారి బహుమతి చేసిన అద్దంలో — మగతగా ఆలిసిన కళ్ళు సిగ్గుతో ఎరు పెక్కిన చెక్కిళ్ళు. శ్రీపతి గీతం ద్వారా పొందిన ఆవేశంలో ఈ ప్రతిబింబాన్ని చూడలేక పోతుంది. తన్ను అద్దంలో చూసుకున్నప్పుడు ఆ ఆకాశం అందుకోలేకపోతోంది. కలలో వాస్తవం కన్పిం చదు. వాస్తవం కల కాదు. రెంటిలో ఏదో ఒకటి తేల్చు

కోవాలి. రెంటికీ మధ్య జరిగే ఘర్షణలో తను నలిగి పోతోంది. బక్కచిక్కి తూలి పోతోంది.

మరురోజు మురారి వచ్చాడు.

'శ్రీపతికి జ్వరం తగిలిందటగా.'

'ఏమో నాకు తెలియదు.'

'పోనీ చూసి రాకపోయినావా?'

'నే నెందుకు చూచిరావటం?'

'అదేమిటి మురారి! స్నేహితుడుగదా!'

'నీకు స్నేహితుడేమో నాకేం కాదు. లక్ష్మి! ఒక్క సంగతి చెప్పనా!'...తటపటాయించాడు.

'నువ్వు శ్రీపతిని గురించి ఆలోచించటం నా కిష్టం లేదు. శ్రీపతి నీలోకి చూస్తూ ఉద్రేక పడితే నా గుండెకు కోతలు పెట్టినట్లుంటుంది. ఇది నాలోని ఈర్ష్య అసూయవల్ల కావచ్చు. నేను మనిషిని. నేను అసూయ పడ తాను. నా సర్వస్వంగా చూసుకునే వస్తువుమీద ఇంకొకరి ప్రభావాన్ని సహించేటంత హృదయం నాకు లేదు. ఇది సంకుచితత్వం కానీ మరేదన్నా కానీ నువ్వు నాదానివి కావాలి. ఇది నా ఆశ. దాన్ని పేరాస అను, ఏమన్నా అను—' కంట నీ రెట్టుకున్నాడు మురారి.

లక్ష్మి జాలిగా మురారిని సముదాయించింది. 'శ్రీపతి నన్ను చూస్తే నువ్వోర్చుకో లేవు. సరే! నే నింకోర్ని చూస్తేనో —!' ప్రశ్న వేశింది. మురారి నివ్వెర పోయాడు. అనుమానంగా లక్ష్మి కళ్ళలోకి చూశాడు. చిన్నబుచ్చు కున్నాడు.

'అది నువ్వే చెప్పాలి. ఎంత త్వరగా చెప్తే అంత మంచిది.' గొణుక్కుంటూ లేచి వెళ్ళిపోయాడు.

లక్ష్మి ముసిముసిగా నవ్వుకుంది. ఇదీ మురారి. అందుకే అతనంటే మమత.

శ్రీపతి ఈ భావాలకు అతీతుడు. అత డేనాడు అసూయ పడలేదు. తను అతని కావ్యకన్యక. తన్నుంచి ఆవేశం పొందుతాడు. భావన చేస్తాడు.

శ్రీపతినిచూసి వద్దామని బయలుదేరింది. మేడ మెట్లు ఎక్కుతుండగానే–స్త్రీకంఠం కిలకిల నవ్వటం, దానికి మొగ కంఠం జతకల్పటం విన్పించింది. ఎందుకో తనగుండె, కలుక్కుమంది.

'రా లక్ష్మీ! అక్కడే నుంచున్నావేం?' శ్రీపతి ఆహ్వానించాడు.

'ఈమె జానకి, కొత్తశిష్యురాలు' పరిచయం చేశాడు. ఎర్రగా నాజూగ్గా ఉన్నముఖం. అందం కొట్టొచ్చినట్టు కనిపించే రెండుకళ్ళు.

'నమస్కారం'

'నమస్తే'

'జ్వరం తగ్గిపోయిందా' తను పరామర్శ చేసింది.

'కన్పించటంలా. కులాసాగా మాట్లాడుతున్నాగా.'

'మరయితే నే నింక వెళ్తాను.'

'కాఫీ తాగిపోదువుగాని'

కాఫీతాగి తిరిగి వచ్చేసింది. మేడమెట్లు దిగుతుంటే మళ్ళీ నవ్వులు విన్పిస్తున్నాయి. ఇంటికొచ్చి ఆలోచించటం మొదలుపెట్టింది. తన మనసు మూగవోయింది. జానకినిచూసి

అసూయపడింది. శ్రీపతి జానకిని ప్రేమిస్తున్నాడేమో? గుండె ఈర్ష్య నింపుకుంది. తనకు ప్రియమైన వస్తువు లాక్కొని పోబడుతున్నట్లు తోచింది. బావురుమంది.

నిన్న మురారి శ్రీపతి నాతో మాట్లాడతాడని ఈర్ష్య పడ్డాడు. తను ఈ రోజు జానకి శ్రీపతితో మాట్లాడుతుందని అసూయ చెందుతోంది. ఈర్ష్య పడటం ద్వారా లేశామాత్రంగా కూడా పరాధీనం కావటం సహించలేమని స్పష్టమౌతోంది. ఈర్ష్య సమన్వితమైన ప్రేమ సమగ్రమైనదా? తను శ్రీపతి విషయంలో అసూయ చెందింది. మురారి విషయంలో కాదు. అతని విషయంలో పరాధీనత ప్రసక్తి లేదు. తన విషయంలో మురారి ఈర్ష్య చెందిన కారణం కూడా అదే. అయితే శ్రీపతి వీటికి అతీతుడు. ఏది ఏమైనా ఈర్ష్య పడగల స్వభావం మురారిది. అంతే. శ్రీపతిది కాదు. తను మురారిని చేసికొంటె — మరి శ్రీపతి కావ్య వస్తువుగా జన్మ సార్థక్యాన్ని తలపోసిన తను — సందిగ్ధంలో పడింది — తల పగిలిపోతోంది.

ఆ మర్నాడు శ్రీపతి నవ్వుతూ వచ్చాడు. ఏమీ జరగనట్టు హాయిగా మాట్లాడాడు. కొత్త గీతం విన్పించాడు. మరో లోకంలోకి చెయ్యిపట్టి లాక్కెళ్ళాడు. మహతీ నిస్వనాలు పలికించాడు. హృదయ నందనంలో ఎన్నో వందల పుష్పాలు పూయించాడు.

'ఈ శ్రీపతినా చెయ్యి జారవిడుచుకోవటం' దిగులుగా చూచింది లక్ష్మి. పెళ్ళి సంబంధాలవారు వచ్చి చూస్తున్నారు — వెళ్తున్నారు. తను సమాధానం చెప్పదు.

తను మురారికి, శ్రీపతికీ మధ్య నలిగి పోతోంది — ఇందులోంచి బయట పడాలి. ఇద్దరూ తన వైపు చేతులు చాచారు. తను అందిస్తే రెండు చేతులూ అందివ్వాలి. తనకు నాలుగు చేతులు లేవు.

మురారిని కాదన లేదు. శ్రీపతిని ఒదులుకోలేదు. తను ఇద్దరిపట్ల మౌనం వహించింది. గుండె రాపిడి పడి పోతోంది. చిక్కి శల్యమై పోతోంది. తను ఏ ఒక్కరి సర్వ స్వంగా ఉండి ఎదటివార్ని చూడలేదు. ఒకే మార్గం — ఇద్దరికీ కాకుండా పోవాలి. ఈ వైరుధ్యం మధ్య మధించబడ్డ తన హృదయానికి శాంతి లేదు. సుఖం లేదు. ఆ సుఖపడే గీత ఉంటే తనలో ఇంతటి విలక్షణత్వం ఉండేది కాదు. ఒక నిర్ణ యానికి రాగల మనస్థైర్యం కలిగేది. ఒకరి జీవిత భాగస్వామి నిగా ఇంకొకర్ని చూట్టంకంటే ఇద్దరికీ కాకుండా ఇలా ఉండ టమే మేలు. తనలో ఇద్దరు నిక్షేపించుకున్న భావాలు అంత ర్థానమైనా తను ఆ ఇద్దరిలో నిల్పుకున్నవి శాశ్వతంగా ఉంటాయి. చెక్కు చెదరవు.

'అమరావతి సంబంధం ఖాయం చేస్తానమ్మా!' అన్నాడు నాన్న.

పెళ్ళి ప్రయత్నాలు సాగుతున్నాయి. తోరణాలు కట్టున్నారు.

'తన దౌర్బల్యం కారణంగా వాళ్ళ జీవితాలు పాడవ కూడదు.' మనసులో భగవంతుణ్ని ప్రార్థించింది.

శ్రీపతి వచ్చాడు. తన ముఖం ఎట్లా చూపిస్తుంది. కాని చూడాలి. కఠుగ్గా ఉండాలి. తన పరుషత్వం కారణంగా శ్రీపతి తననుంచి వేరై సుఖపడాలి.

ముఖంలో నవ్వు తెచ్చి పెట్టుకుంది లక్ష్మి.

కాని శ్రీపతి నేల చూస్తున్నాడు.

'రేపు శాంతినికేతనం వెళ్తున్నాను ఎం. ఎ. చదవటానికి.'

'ఉపశాంతి కోసమా ?'

తల పైకెత్తి తనలోకి చూశాడు. ఆ కళ్ళు చూడలేకపోయింది. శ్రీపతి తన కళ్ళలో సముద్రాలు ఇంకింప చేసుకున్నాడు.

లక్ష్మి కళ్ళుమూసుకుంది. కళ్ళు తెరిచేసరికి శ్రీపతి వెళ్ళిపోయాడు. తనమీద రాసిన కవిత్వం బల్లమీద విడిచి వెళ్ళిపోయాడు. వణుకుతున్న చేతుల్తో దాన్ని అందుకుని గుండెకు హత్తుకుంది. తనగుండె రెండుగాకోసి ఇద్దరికీ పంచింది. ఈ కవిత్వం ఒక భాగం చిహ్నం. ఆకోతలోని బాధ, స్రవించిన కన్నీళ్ళు తనకి మిగిలాయి.

తనకు తానుగా మురారిని చూట్టానికి ప్రయాణమైంది.

మురారి దిగులుపడ్డాడు. లక్ష్మికి తెలుసు దిగులుపడతాడని—కాని పడ్డట్టులేదు. ఏదో దిగమింగుకుని లక్ష్మిని పలకరించాడు. వివాహపుకాన్క లేవో అందించాడు. లక్ష్మిలో చైతన్యంపోయింది. మురారిని చూడలేదు. అతడు కరుడుగట్టిన దుఃఖంలా, సిద్ధిపొందిన నిగ్రహంలా కన్పించాడు.

'మురారీ! నామీద కోపమా?'

'లేదు' దిగులుగా నవ్వాడు.

'పెళ్ళికి రావా?'

'వస్తాను. నేను శ్రీపతినికాదు. ఊరువిడిచి పోవటానికి.'

'శ్రీపతి నేమీ అనకు మురారీ. నేను బాధపడ్తాను.'

తప్పుచేసినవాడిలా చూశాడు మురారి.

'నాకు ఒక్క కోరిక తీరుస్తావా?' ఆశగా చూస్తూ అడిగింది లక్ష్మి.

'చెప్పు'

'మురారీ నన్ను ముద్దుపెట్టుకో—!'

మురారి దిగ్భ్రాంతు డయ్యాడు. శంకాభావంతో చూశాడు. లేచిపోబోయ్యాడు. లక్ష్మి కాళ్ళకి చుట్టేసుకుంది.

'నా జీవితంలో మనసార ముద్దుపెట్టుకోవటం ఇదే తొలి సారి. ఇంక జరగదు.' మురారిపాదాలు ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది—నేలతగిలింది—